క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజా ఆరోగ్య వేదిక, జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి వైద్యులు నాగభూషణం, సంధ్య, పూజిత హాజరై బీపీ, షుగర్, పక్షవాతం, ఫిట్స్ రోగాలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం రూ.200కే రెండు నెలలకు సరిపడ్డా మందులను అందజేసినట్లు సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేషయ్య, బసయ్య, రంగస్వామి, మెడికల్ రెప్‌లు ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం



స్టేడియంలో కేక్ కట్ చేస్తున్న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఆదివారం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డితో పాటు అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు వెంకటేష్, సీనియర్ క్రీడాకారులు మాధవరావు, హసీనా హాజరై కేక్ కట్ చేసి క్రీడాకారులకు పంచారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ క్రీడాకారుల సంక్షేమానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

లైబ్రరీ సైన్స్ అసోసియేషన్‌లో చోటు



నాయకల్లు సుంకన్న

కర్నూలు సిటీ: ఏపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీల లైబ్రరీ సైన్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పాలక వర్గంలో జనరల్ సెక్రటరీగా గూడురు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లైబ్రరీ సైన్స్ అధ్యాపకుడు నాయకల్లు సుంకన్న ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం గుంటూరులో ఏపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీల లైబ్రరీ సైన్స్ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ పాలక వర్గ సమావేశం జరిగిందని, ఇందులో రాష్ట్ర అధ్యక్షుడిగా తాతారావు(శ్రీకాకుళం)ను, జనరల్ సెక్రటరీగా తనను ఏకగ్రీంగా ఎన్నుకున్నారన్నారు.

శ్రీశైల దేవస్థానం ఉద్యోగులకు పదోన్నతులు



వెంకటలక్ష్మికి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పదోన్నతులు కల్పించినట్లు శ్రీశైల దేవస్థాన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఉద్యోగులకు పదోన్నతుల ఉత్తర్వులు ఈఓ అందజేశారు. రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసులు, ఎస్.లోకేశ్వరప్ప, కె.అనురాధ, వి.వెంకటలక్ష్మిలకు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. అలాగే అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.మహేష్ నాయక్‌కు రికార్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ఈఓ కు ఉద్యోగుల తరుపున ఆ సంఘం అధ్యక్షుడు ధన్యవాదాలు తెలియజేశారు.

కమనీయం... మహానందీశ్వరుడి కల్యాణం



మహానందీశ్వర దంపతులకు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది:మహానందిలో శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, అర్చకులు హరికుమార శర్మలు స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగల్య ధారణ, అక్షతల సమర్పణ పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల్లో పాల్గొని స్వామి కల్యాణం జరిపించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

పార్టీ కార్యాలయాలు కూల్చడమే ప్రజాస్వామ్యమా?

- చెరువులు, పోరంబోకు స్థలాల్లో టీడీపీ ఆఫీసులు లేవా?
- ప్రశ్నించిన నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి
- మొదట ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు



సమావేశంలో మాట్లాడుతున్న నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

కర్నూలు (టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి సంఘటనలు ఎక్కువయ్యాయన్నారు. కొందరు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. తాజాగా తాడేపల్లిలోని తమ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సైతం కూల్చారన్నారు. ఇది ప్రజాస్వామ్యమా..రాజకీయ కక్ష సాధింపు చర్యలా అని ప్రశ్నించారు. రజాకర్ల పాలనను తలపిస్తున్న బాబు పాలనను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఆదివారం సాయంత్రం లబ్బి స్థానిక గణేష్ నగర్‌లోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 'ప్రజలు మీకు అధికారం ఇచ్చింది ప్రతిపక్ష పార్టీ నాయకులను భయపెట్టడానికి, పార్టీ కార్యాలయాలను కూల్చడానికి కాదు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలును పక్కన పెట్టి కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదు. గతంలో చెరువులు, పోరంబోకు స్థలాలు కబ్జా చేసి టీడీపీ కార్యాలయాలు నిర్మించింది నిజం కాదా? 2016లో తెలుగుదేశం ప్రభుత్వమే జీవో 21 ప్రకారం రాష్ట్ర స్థాయిలో 4 ఎకరాలు, జిల్లా స్థాయిలో 2 ఎకరాలు పార్టీ కార్యాలయాలకు అనుమతులు ఇచ్చింది. ఈ విషయం మరిచిపోతే ఎలా. కనీస మర్యాద పాటించకుండా స్పీకర్ ఎన్నిక సమయంలో సభా నాయకుడు, డిప్యూటీ సీఎం, హోంమంత్రి తదితరులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలకు సంబంధించిన ఒక్క మాట కూడా సభలో మాట్లాడలేదు. ఎన్నికల ముందు పోస్టల్ బ్యాలెట్ ఓట్లన్నీ తెలుగుదేశం పార్టీకి వచ్చాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేయడం, అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం అధికారం కోసం పన్నిన కుట్ర కాదా' అని లబ్బివెంకట స్వామి ప్రశ్నించారు. టీడీపీ నాయకులకు సంయమనం పాటించాలని బయట చెప్పి, లోపల మాత్రం దౌర్జన్యాలు, దాడులు చేసే విధంగా చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇది మంచి పద్ధతి కాదని.. తీరు మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తిరగబడుతారని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి రూ. 2.70 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు.

సూపర్ సిక్స్ అమలుపై దృష్టి పెట్టండి

సూపర్ సిక్స్ హామీలైన సామాజిక పెన్షన్ పెంపుతో పాటు 50 ఏళ్లకే పెన్షన్, 18 ఏళ్ల పైబడిన మహిళలకు నెలకు రూ.1500, కుటుంబానికి 3 సిలిండర్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం అమలుపై టీడీపీ దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే ఏపీలో శాంతి భద్రతలు అదుపుతప్పాయని, దాడులు, హత్యలు పెరిగాయన్నారు. బాపట్ల జిల్లాలో మహిళను రేప్ చేసి హత్య చేసినా చర్యలు లేవన్నారు. మహిళలకు రక్షణపై భరోసా ఇవ్వాల్సిన బాధ్యత సర్కారుపై ఉందన్నారు. విలేకరుల సమావేశంలో సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ నాయకులు కుర్షీద్ అహమ్మద్, మాజీ సర్పంచ్ మల్లికార్జున యాదవ్ పాల్గొన్నారు.

'పది' తరువాతే ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టాలి

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి తరువాతే ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి ఎస్కే మొబీన ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇటీవల 9వ తరగతి నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం విడుదల చేసిన నోట్‌ను ఆమె తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రపంచమంతా అంగీకరించిన విద్యా సూత్రం ప్రకారం 10వ తరగతి వరకు విద్యార్థులకు ప్రకృతి, సమాజం వంటి మౌలిక విషయాలతోపాటు భాషలు, సాహిత్య అధ్యయనాన్ని అలవాటు చేసి వ్యక్తిత్వ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాయన్నారు. అలాకాకుండా 9వ తరగతి నుంచి ఒకేషనల్ కోర్సులను చదివేలా ప్రణాళికలు రూపొందించడం మంచికాదన్నారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ భూములకు ఆదివారం నిర్వహించిన వేలంలో రూ.1,57,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ సువర్ణ తెలిపారు. మొత్తం 26.44 ఎకరాలకు వేలం నిర్వహించగా 22 మంది పాల్గొన్నారని చెప్పారు. గత ఏడాది రూ.61,500 రాగా ఈ ఏడాది రూ.95,500 అదనంగా ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.

వైభవంగా పాణి హట్టి చిడాదహి మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో శ్రీకృష్ణ బలరామ మూర్తులు



ప్రవచనం చెబుతున్న రూపేశ్వర చైతన్య ప్రభు



శ్రీకృష్ణ బలరామ మూర్తులకు మహారాజ భోగ నివేదన

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు నగరవనంలో వైభవంగా పాణి హట్టి చిడాదహి మహోత్సవం జరిగింది. శ్రీకృష్ణ బలరామమూర్తులకు మహా శంఖాభిషేకం నిర్వహించారు. 108 రకాల పదార్థాలతో మహారాజ భోగ నివేదన చేసి మహా ప్రసాద నివేదన చేశారు. తిరుపతి ఇస్కాన్ ఉపాధ్యక్షులు రూపేశ్వర చైతన్య ప్రభు ప్రవచనం చెప్పారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప ప్రభు, కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ, ఆరోగ్యానికి క్రీడలు అవసరం

కర్నూలు (టౌన్): ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి క్రీడలు చాలా అవసరమని హోమియోపతి వైద్యులు డాక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి జూనియర్స్ ఉషూ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఉషు సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28, 29 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ ఉషూ పోటీల్లో పాల్గొంటారన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన అవసరం

- నారుమళ్లకు ముందు విత్తనశుద్ధి తప్పనిసరి
- బనవాసి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త మౌనిక సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌లో కూరగాయల సాగు పెరుగుతోందని, సాగు పద్ధతులపై అవగాహన పెంచుకుంటే అందులో రాణించే వీలుందని బనవాసి కృషి విజ్ఞానకేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వై.మౌనిక తెలిపారు.ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లోమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన శాస్త్రవేత్త మౌనిక మాట్లాడుతూ... కూరగాయల నారుమడులు పెంచడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల్లో భాగంగా ఔషధ పంటల సాగు.. ఉపయోగాల గురించి వివరించారు. నారుమడులు పెంచుటకు ముందు విత్తనాలను తగిన రసాయనలతో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. దీని వల్ల వేరుకుళ్లు తెగుళ్ల వంటివి వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. నారు నాటడం ఆలస్యమైనప్పుడు కొనలు తుంచి నాటడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఔషధ మొక్కల్లో అలోవీర, అశ్వగంధ మొదలైన పంటలు వేసుకోవచ్చని వివరించారు. మార్కెటింగ్ సదుపాయాన్ని బట్టి ఔషధ మొక్కలు సాగు చేసుకోవాలని సూచించారు. రైతులను ఉద్యాన పంట వైపు మళ్లించాలని ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. రైతులు ప్రతి అవసరానికి సలహాలు, సూచనల కోసం ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తుంటారని వారికి మంచి సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లోమ కోర్సు సమన్వయకర్త జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంధత్వాన్ని ఆత్మవిశ్వాసంతో అధిగమించాలి



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి. శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): అంధత్వాన్ని శాపంగా భావించకుండా ఆత్మవిశ్వాసంతో అధిగమించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ అన్నారు. నగర సమీపంలోని పసుపుల గ్రామం వద్ద ఉన్న అమ్మ అంధుల పాఠశాల విద్యార్థులకు ఒక నెల రోజులకు సరిపోయే విధంగా నిత్యావసర వస్తువులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. శంకరశర్మ మాట్లాడుతూ అమ్మ అంధుల పాఠశాలలోని విద్యార్థులు చూపు లేకపోయినప్పటికీ తమ జ్ఞాన నేత్రంతో ఈ ప్రపంచాన్ని చూడగలగడం అభినందనీయమన్నారు. మామూలు విద్యార్థులతో పోలిస్తే అంధత్వంతో బాధపడే విద్యార్థులకు ప్రత్యేక రక్షణ అవసరమని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వాలు, ఎన్‌జీఓలు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అంధులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



మల్లన్న దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. వేకువజామున్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి క్యూలైన్ల వద్దకు చేరుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజాము నుంచే భక్తులను మల్లన్న దర్శనానికి అనుమతించారు. భక్తులకు కంపార్ట్‌మెంట్లలో, క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన అధికారులు పర్యవేక్షణ చేపట్టారు. ఉచిత దర్శనానికి 4 గంటల సమయం, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

వణుకుతున్న చాబోలు

- అతిసారం బారిన మరో ముగ్గురు
- బాధితులను నందికొట్కూరు సీహెచ్‌సీకి తరలింపు

జూపాడుబంగ్లా: చాబోలు గ్రామాన్ని అతిసార వ్యాధి వణికిస్తోంది. నాలుగు రోజులుగా కేసులు నమోదువుతుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం ఆరేళ్ల వయస్సున్న లావణ్యతో పాటు మరో ఇద్దరు అతిసారం బారిన పడటంతో వారిని 108లో నందికొట్కూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతున్నా సరైన సౌకర్యాలు లేకపోవడంతో బాధితులను వెంటనే నందికొట్కూరుకు తరలిస్తున్నారు. ఆరోగ్య, ఆశా వర్కర్లు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి గ్రామస్తుల ఆరోగ్యస్థితిని తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం బాధితుల సంఖ్య 38కి చేరింది. వారిలో కొంత మంది కోలుకొని ఇంటికి చేరుకొన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మిగిలిన వారు నందికొట్కూరు, కర్నూలు ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. గ్రామంలో అతిసారం వ్యాధి వ్యాపించి నాలుగు రోజులైనా వ్యాధి వ్యాప్తికి గల కారణాలను తేల్చడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్

పోతులపాడు మజారా చాబోలు గ్రామంలో అతిసారం వ్యాధి ప్రబలి నడిపినాగన్న అనే వ్యక్తి మృతికి బాధ్యులను చేస్తూ 80 బన్నూరు పంచాయతీ కార్యదర్శి సామేలు, పోతులపాడు పంచాయతీ కార్యదర్శి మంజులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జూపాడుబంగ్లా ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ నూర్జహాన్ పంచాయతీ కార్యదర్శులకు సస్పెండ్ నోటీసులు, ఈఓపీఆర్డీకి షోకాజ్ నోటీసును అందజేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చాబోలులో అతిసారం వ్యాధి ప్రబలి నడిపి నాగన్న అనే వ్యక్తి మృతిచెందిన విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి ఆదివారం గ్రామంలో పర్యటించారు.నాగన్న మృతికి కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అతిసారం బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు యశస్విని, నాగేంద్ర లకు సూచించారు. అతిసారం వ్యాధి ప్రబలడానికి కారణమైన సర్పంచ్ పల్లెనిర్మలమ్మపై కేసునమోదు చేయించటంతో పాటు చెక్‌పవర్ రద్దు చేయిస్తామని తెలిపారు.


దళిత మహిళపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



బాధితురాలిని పరామర్శిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్):వెల్దుర్తి మండలం రత్నపల్లెకు చెందిన దళిత మహిళ హనుమక్కపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన బోయిని ఆనంద్,గొల్ల నరేంద్ర, రామలింగం, భూపాల్, లోకేష్, సోమేష్, శేఖర్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. ఆరు రోజుల క్రితం హనుమక్కపై దాడి జరిగితే ఇంత వరకు పోలీసులు కేసు నమోదు చేయకపోవడం భావ్యం కాదన్నారు. ఆదివారం ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని కేవీపీఎస్ నాయకులు ఎండీ ఆనంద బాబు, విజయమ్మ, సుధాకర్ పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రత్నపల్లి గ్రామ సర్వే నంబర్ 973/ఏ2ఈలో మూడు ఎకరాల వంకపోరంబోకు భూమిని హనుమక్క వంశీయులు మూడు తరాలుగా అనుభవిస్తూ వస్తున్నారని, అయితే ఆ భూమిని లాక్కోని విత్తనం వేయడానికి ప్రయత్నించిన సంఘటనలో ఆమెపై దాడి చేశారన్నారు. ఆమెను కులంపేరుతో దూషిస్తూ కర్రలు, కట్టెలతో దాడి చేస్తుండగా అడ్డుకోబోయిన భర్త పెద్ద రాముడు, మరిది కుమారుడు రామాంజనేయులపై కూడా దాడి చేశారన్నారు. అయితే ఈ ఘటన జరిగి ఆరు రోజులు గడుస్తున్నా వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేయడంలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్ఐని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బతుకుదెరువు కోసం వచ్చి మృత్యుఒడిలోకి..




బోకుల్ సింకు మృతదేహం

కృష్ణగిరి: బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకుని జార్ఖండ్ నుంచి వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం హట్ గమాసియా జిల్లా నుంచి కొందరు వ్యక్తులు లక్కసాగరం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి అనే కంట్రాక్టర్ వద్ద కరెంటు పనులు చేసేందుకు 5 నెలల కింద వచ్చారు. వీరు కంబాలపాడు గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉంటూ రోజు కరెంటు పనులకు వెళ్లేవారు. శనివారం సాయంత్రం బోకుల్ సింకు(20), దున్నై అనే వ్యక్తితో కలిసి ట్రాక్టర్(ఏపీ39వీఎస్3488)ను తీసుకుని కంబాలపాడు నుంచి పెనుమాడకు వెళ్లారు. అక్కడున్న బావి వద్ద ఎత్తయిన ప్రదేశంలో ట్రాక్టర్ ఉంచి కట్టెలు లోడ్ చేస్తున్నారు. కుదుపులకు బోకుల్ సింకు కిందపడడం.. అదే సమయంలో ట్రాక్టర్ అతనిపై వెళ్లడంతో మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివారం మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

క్రీడల అభివృద్ధికి సహకారం


- ఒలింపిక్ డే రన్‌లో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్

కర్నూలు (టౌన్) : క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం ఒలింపిక్ డే రన్‌ను పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు పరుగు చేపట్టారు. ముగింపు కార్యక్రమంలో టీజీ మాట్లాడుతూ ప్యారిస్‌లో నిర్వహించనున్న ఒలింపిక్స్ వేడుకలు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు బడ్జెట్ గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్టేడియాలకు కేటాయించిన స్థలాలను వాటికే వినియోగించాలన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు తాను ఎంచుకున్న క్రీడలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అంతకు ముందు కలెక్టరేట్, రాజ్‌విహార్, కిడ్స్ వరల్డ్, కోట్ల సర్కిల్ మీదుగా కొండారెడ్డి బురుజు వరకు రన్ నిర్వహించారు. ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నటేకూరు, దిన్నెదేవరపాడు హాస్టల్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, కేవీ సుబ్బారెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు సుధీర్, మున్నా, హర్షవర్ధన్, విజయ్‌కుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తులుగా పనస కాయలు



స్మృతివనంలో కాసిన పనస కాయలు

ఆత్మకూరురూరల్: సహజంగా కొన్ని రకాల ఫలాలనిచ్చే వృక్షాలు పరిమితమైన ప్రాంతాల్లో మాత్రమే మన్న గలుగుతాయంటారు. ఉదాహరణకు ఆపిల్ పండ్లు కశ్మీర్, హిమాచల ప్రదేశ్ లాంటి శీతల ప్రదేశాలలో మాత్రమే కాస్తాయి. అలాగే పనస మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్రలో మాత్రమే కాస్తుంది. కానీ చిత్రంగా ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామ శివార్లలో ఉన్న వైఎస్సార్ స్మృతివనంలో పనస చెట్టు ఏపుగా పెరగడమే కాకుండా గుత్తులు గుత్తులుగా కాయలు కాశాయి. పనస చెట్టు మొదలుకు కాసిన పనస పండ్ల గుత్తులను సందర్శకులు అబ్బురంగా చూస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యద్భుతంగా నిర్వహించబడుతున్న వైఎస్సార్ స్మృతివనంలో పనస చెట్టే కాక పలుజాతుల ఫల, పుష్పల మొక్కలు, చెట్లు ఉన్నాయి. సుమారు 560 రకాల జాతులు ఉన్నట్లు అక్కడి నిర్వాహకులు చెబుతున్నారు.

వేదవతి, గుండ్రేవులను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడికాలువల నిర్మాణంపై దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. గురువారం కార్మిక,కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని కార్యవర్గ సభ్యుడు ఎండీ ఆనందబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ పెండింగ్ పరిశ్రమలను పూర్తి చేయడంతోపాటు పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలను చూపించాలన్నారు గత ప్రభుత్వం మాటలు చెప్పి ఏ పని చేయలేకపోవడంతోనే ప్రజలు వ్యతిరేకించారన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా పనులను చేతల్లో చూపకపోతే ఇబ్బందులు పడక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, కేవీ నారాయణ, బి.రామాంజనేయులు, ఎండీ అంజిబాబు,అలివేలమ్మ, అరుణమ్మ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ

ఓర్వకల్లు: కాల్వబుగ్గ సమీపంలోని కాకతీయ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల పీఈటీ నరేష్ తెలిపారు. ఈ నెల 22వ తేదీ కర్నూలులో ఒలింపిక్ డే రన్ సందర్భంగా నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల కోసం ఆదివారం అభినందన సభ నిర్వహించారు. పాఠశాల నిర్వాహకులు దేవిక, సూర్యతేజ, హెచ్ఎం మనోహర్‌నాయుడు విద్యార్థులను అభినందించారు.

మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంతసేవ సమయం వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణు గుండం కోనేర్లలో పుణ్య స్నానాలు ఆచరించారు.

ఆదర్శనీయులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ



శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కర్నూలు కల్చరల్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆదర్శనీయులని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందిరా గాంధీ మెమోరియల్ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ పార్టీకి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదని ఆర్టికల్ 370ని వెంటనే రద్దు చేయాలనే ఉద్యమంలో ఆయన బలిదానం కావడం జరిగిందని గుర్తి చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి భగత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రంగస్వామి, సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోలంకి రామస్వామి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

- కర్నూలు గ్రామీణ మండల పరిధి 118 బూత్‌లో జరిగిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యవర్గ సభ్యులు మురళి నాయుడు, కోడుమూరు అసెంబ్లీ కో కన్వీనర్ లోకేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.